

రామారావు ఉద్యోగరీత్యా బదిలీమీద వెంకటాపురం వెళ్ళవలసివచ్చింది. అది బొత్తిగా కుగ్రామమని తెలిసింది. అందువల్లనే అతను ముందు తను ఒక్కడే పోయి, కొంపా గోడూ కుదిరాక. వీలునుబట్టి భార్యాపిల్లలను తీసుకొనివెళ్ళడం మంచిదని అనుకొన్నాడు. అలా ఒకనిర్ణయానికి వచ్చినప్పటినుంచీ అక్కడ తాను ఒంటరిగా గడపడం ఎలాగా అన్న దిగులు పట్టుకొన్నది అతనికి.

సన్నగా, నాజూకుగా కన్పించినా రామారావు మంచి సత్తువకల మనిషి. పైకి కొంచెం మెతగ్గా. అమాయకంగా కన్పించినా అధైర్యపడే మనిషికాదు; వ్యవహారదక్షత లేనివాడు కాదు. కొంచెం ముందుచూపు కలవాడే. అందువల్లనే అతను అరణ్య మధ్యములో ఉన్నదా అనిపించే ఆ గ్రామానికి వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

వెంకటాపురం చేరుకొన్న కొద్దిసేపటికే రామారావుకు అక్కడి పరిస్థితులు అర్థం అయాయి ఆ ఊళ్ళో అద్దెకు ఇచ్చేపాటి పెద్దఇల్లే లేదు. ఉన్నవన్నీ చిన్నఇళ్ళు. వాటిలో

ఎక్కువ పాకలు; పది పన్నెండు పెంకుటిళ్ళు; నాలుగో అయిదో మిద్దెలు. ఊరుమొత్తంమీద పెద్దడాబా ఒక్కటే ఉన్నది. అది ప్రకాశం అనే కాంట్రాక్టరు సర్వసౌకర్యాలతో అందంగా అత్యంతఆధునికంగా కట్టు కొన్న భవనం. అతనుతప్ప అక్కడ మరెవ్వరూ బయటవాళ్ళకు ఆశ్రయం ఇవ్వరు. ఇచ్చేపాటి స్తోమతు లేక పోవడమే అందుకు ప్రధానకారణం. అలా ఆశ్రయం ఇవ్వకలిగినవాడు అతను ఒక్కడే. ఈ వివరాలతోపాటు ఆ మనిషి చండప్రచండుడనీ, పరాయి వాళ్ళను అనవసరంగా గుమ్మంలో అడుగు పెట్టనివ్వడనీ రామారావుకు తెలిసింది. కాని ఆయన ఆశ్రయం కోరకపోవడంమరింతప్రమాదకరమనీ, ఆయన ఆసరా లేనిదే ఎవ్వరూ ఆ గ్రామంలో ఏపనీ చెయ్యలేరనికూడా అతను విన్నాడు.

అతను అన్నీ విని జాగ్రత్తగా ఆలోచించాడు. వెంటనే ఒక నిర్ణయానికి వచ్చాడతను. ఆమరుక్షణంలో బయలుదేరి, గబగబా నడచి, ప్రకాశం ఇంటికి వెళ్ళాడు. గేటు తీసుకొని బయటకు వెళుతున్న నౌకరును ఆపి, ఆ యింటియజమాని లోపల ఉన్నాడా అని అడిగాడు. అతను అలా అడుగుతుండగా ప్రకాశం నెమ్మదిగా డాబా వసారా చివరకు వచ్చి "ఎవరది? ఏం పనిమీద వచ్చావయ్యా?" అని పెద్దగా అడిగాడు.

రామారావు ప్రకాశాన్ని దూరం నుంచే చూచాడు. ఒక్కక్షణం ఎవరో జ్ఞాపకం వచ్చారు అతన్ని చూడగానే. రామారావుకు గౌరవంతోపాటు ఒక విధమైన భయం కలిగింది. అతను తాడిచెట్టంత ఎత్తుగా ఉన్నాడని అనిపించింది. మళ్ళీ అంతలో దట్టంగా గుమ్మటంలా ఎదిగిన గున్నమావిడలా ఉన్నాడనికూడా అనిపించింది,

ప్రకాశం మంచి ఎత్తరి.

ఆ ఎత్తుకు తగ్గట్టు అతను లావు కూడానూ. కాని అతను లావుపాటి మనిషి అనిపించడు. మెలితిరిగిన కండలుపట్టిన ఒళ్ళు, నిమ్మపండువంటి శరీర చాయ; ఒడలంతా ఒక వింతైన సైగనిగ్యం. విశాలమైన నుదురు. పెద్ద క్రాపు ఆకర్ణాంతములా అనిపించే పెద్ద కళ్ళు. కోలే రేసినట్టున్న పొడుగైన ముక్కు. ఆ కనుముక్కు తీరు అందమైనది. క్రమంగా విల్లులా వంగి కొంచెం ఒత్తుగా కండ్లకు తగుమాత్రం దూరంగా ఉన్న కనుబొమ్మల మూలంగా ముఖానికి అందం, తుమ్మెద రెక్కలలా నల్లగా ఒత్తుగా ఉన్న బుజ్జమీసాలమూలంగా గాంభీర్యం కలిగాయి. ఆ కన్నులలోని ఒక వింత కాంతి, ఒక క్రొత్తవెలుగుమూలంగా ఆకర్షణ అబ్బింది. అతను పలనాటి

తెలుగుజోదులా కన్పించాడు. అంతలో అతను గంభీరంగా కళ్ళు పెద్దవిచేసుకొని చూచాడు. అతని కళ్ళల్లో ఎఱ్ఱజీర కనిపించింది. మోర ఎగురవేస్తూ, ఉండిఉండి ఉరిమిచూస్తూ అతను అలా అడగేసరికి నిద్రాభంగం కలిగించినందుకు హూంకరిస్తున్న సింహంఎదుట వెనుకకాళ్ళమీద నిలబడి, ముందుకాళ్ళు చేతుల్లా ఎత్తి నమస్కరిస్తున్న ఉడతలా ఒణుకుతూ చేతులు కట్టుకోబోతూ, నమస్కారం చేయబోతూ ఉన్న రామారావు కొంతసేపటిదాకా నోరు మెదపలేక పోయాడు. తర్వాత నమస్కారం చేసి విషయం చెప్పడానికి ప్రయత్నం చేశాడు. మాట తడబడ్డాడు.

అంతలో ప్రకాశం అక్కడినుంచే "ఆఁ ఆఁ, అర్ధమయిందిలే. ఇక్కడకు క్రొత్తగా ఆఫీసరుగా వచ్చావుకదూ! సరె సరే, భోజనం అయిందా?" అన్నాడు.

అలా అంటూ అతను వసారా మెట్లు దిగి గేటుదగ్గరకు వచ్చాడు. అతను రామారావువంక ఒక్కక్షణం తేరిపార చూచాడు. మరుక్షణంలో ఆప్రాంతం అంతా తద్దరిల్లిపోయేలా పెద్దగా నవ్వడం మొదలుపెట్టాడు. ఆ సమయంలో అక్కడే కొంచెం దూరంగా క్రోటన్ చెట్ల వెనుక నిలబడిఉన్న అతని భార్య, భర్త ఎందుకలా నవ్వుతున్నాడా అని ఆశ్చర్యపడుతూ నెమ్మదిగా అక్కడకు వచ్చింది.

రామారావును చూడగానే గుర్తుపట్టింది.

ఆమె నెమ్మదిగా ముందుకు వచ్చింది. ప్రకాశం నవ్వడం మాని అతని బుజంపై చెయ్యి వేసి, "అరి బక్కాడా! నువ్వా! రామారావ్వు కదూ! నేను ప్రకాశాన్ని - పోల్చుకోలా?" అన్నాడు.

సావిత్రి మరో అడుగు ముందుకు వేసి చిరునవ్వు నవ్వుతూ, "ఏమండీ రామారావుగారూ! బాగున్నారా?" అన్నది.

రామారావు అప్పటికి తేరుకొంటూ "అరే, మీరా! మీరు సావిత్రి కదూ?" అన్నాడు. ప్రకాశం మళ్ళీ పెద్దగా నవ్వుతూ, "అయితే నువ్వు మా ఇద్దరికీ పరిచయం అన్నమాట. మనం ఇద్దరం బి.ఏ. కలిసి చదువుకోలేదుటయ్యా! ఏం, ఇప్పుడైనా జ్ఞాపకం వచ్చిందా?" అన్నాడు. అతడు సమాధానం చెప్పక ముందే సావిత్రి మాట అందుకొని, "ఆయనకు ఏమీ జ్ఞాపకం లేనట్టుంది లెండి. మే మిద్దరం కలసి చిన్నప్పుడు హైస్కూల్లో నాలుగేళ్లు చదువుకొన్నాం. మనం అంతగా మారిపోయా మన్నమాట: ఆయన మాత్రం ఏ మాత్రం మారలేదు. సరే, సరే,

రండి; ముందు లోపలకు రండి,'' అన్నది.

సావిత్రి రామారావును లోపలకు ఆహ్వానించింది.

* * *

రామారావుకు సావిత్రిని చూడగానే తన భార్య జ్ఞాపకం వచ్చింది. అతని భార్య కురూపేమీ కాదు. తనకు అన్నివిధాలా నచ్చిన రూపురేఖలూ, గుణగణాలూ ఉండడంవల్లనే అతను ఆమెను వివాహం చేసుకొన్నాడు ఆమె ఒకరకంగా అందమైనదే. కాని సావిత్రి అందం వేరు.

సావిత్రి చాలా అందగత్తె

ఆమె నిజంగా విద్యుల్లత.

నిలువెల్ల పూచిన పూలతీవె ఆమె.

ఆమె ఎప్పుడూ ఎంతో ప్రసన్నంగా కన్పించేది. మొదట్లో కొన్నిరోజులు ఆమె రామారావు ముందుకు వచ్చి మాటాడడానికి జంకుతున్నట్లు కన్పించింది అది నాగరికం కాదనీ, పైగా చిన్ననాటి స్నేహితునిముందుకు రాకపోవటం మర్యాద కాదనీ ప్రకాశం ఆమెను మందలించాడు. ఫలితంగా ఆమె రామారావుతో ఆమాటా ఈమాటా మాటాడడం మొదలు పెట్టింది.

పదిరోజుల తరువాత రామారావు వేరే వంట చేసుకొంటా నన్నాడు. అలా వీల్లేదన్నది సావిత్రి. ఆ వూళ్ళో వున్నంత కాలం అక్కడే వుండాలనీ తమతోపాటే తినాలనీ ఆమె పట్టుపట్టింది. "మీకోసం యేమ న్నా చెయ్యాలా ఏమన్నా నా. వంటమనిషి వున్నది; పనివా ళ్ళున్నారు. అదనంగా మాకు కాగల ఖర్చుకూడా ఏమీలేదు. కనుక మరోమాట చెప్పకండి,'' అన్నది సావిత్రి.

"అవును, అది మనకు మర్యాద కూడానూ," అన్నాడు ప్రకాశం.

అన్నివిధాలా వసతి కుదిరినప్పటినుంచీ రామారావు అక్కడ ఉద్యోగరీత్యా నిర్వహించవలసిన పనులు ప్రారంభించాడు ఆ యా కార్యక్రమ ప్రణాళికలు రూపొందించాడు. అందులో వేటికి ముందు ప్రాధాన్యం ఇవ్వాలో నిర్ణయించుకొన్నాడు. గ్రామంలో నలుగురినీ సంప్రదించాడు. ఇతరపథకాలతోపాటు కార్యాలయం ఏర్పాటు చెయ్యడానికీ, సమావేశాలు జరపడానికీ వీలుగా ఉండే భవన నిర్మాణ కార్యక్రమం ప్రారంభించాలని కూడా నిర్ణయం అయింది. అందుకు ప్రకాశం మద్దతు కూడా లభించింది.

అన్నిపనులూ సక్రమంగా జరిగితే ఒక్క ఏడాదిలోనే తనకు తప్పక పై పదవి లభించగలదని రామారావు ఆశించాడు. ఆ యా విషయాలన్నీ సావిత్రికి వివరంగా చెప్పి, తనకు




త్వరలో 'ప్రమోషను' రాకతప్పదని ఉబ్బిపోయాడు. అతను ఇంటికి వ్రాసిన ఉత్తరాలలో కూడా ఈ విషయం ప్రస్తావించాడు.

సావిత్రి అతను చెప్పినవన్నీ విని చిరునవ్వు నవ్వేది. ఆమె నవ్వితే ఎంతో అందంగా ఉండేది బొడ్డు మల్లెలు అప్పటికప్పుడు అలా చప్పున వికసించినట్టు ఉండేది.

రామారావుకు ఆ చుట్టుపట్టు లన్నీ క్రమంగా పరిచయం అయినకొద్దీ మొదట్లో ఉన్న దిగులు పోయింది. విసుగూ విరామం లేకుండా తిరుగుతుండే రకరకాల మోటారు వాహనాల రణగొణధ్వనులతో బస్తీ జీవితానికి అలవాటుపడినవాడు కావడంచేత అతను మొదట్లో ఆ ప్రశాంతవాతావరణం చూచి కొంత భయపడ్డాడు. నెమ్మదిగా ఆ భయం పోవడమే కాదు, కేవలం ఎత్తైన రాతి కట్టడాలు చూచి అబ్బురపడుతుండే మనిషి, పల్లెపట్టుల రమణీయమైన ప్రకృతిదృశ్యాలు చూచి మురిసి పోవడం మొదలుపెట్టాడు.

ఆఊరు కావడానికి చిన్నదే అయినా ఎంతో పొంకంగా ఉన్నది. బాటలన్నీ తీర్చిదిద్దినట్టుగా ఉన్నాయి.

ఆ గ్రామానికి అర్ధమైలుదూరంలో తూర్పువైపున ఏరొకటి ఉన్నది. ఊళ్ళో అందరూ ఏటినుంచే మంచినీరు తెచ్చుకొంటూరు. వేసవికాలం మంచి నీటికోసం ఏటిగట్టున త్రవ్విన బావి ఉన్నది. పడమటివైపున చింతతోపుకు ఆవల దూరదూరాన ఎత్తైన కొండ.

కొండమీద దట్టమైన అడివి; కొండను ఆనుకొని నాలుగయిదు ఎకరాలమేర ఆక్రమించుకొన్న చెరువు. గ్రామంలో బాటలకు ఇరుప్రక్కలా ఖాళీజాగాల లోనూ, గ్రామంచుట్టూనూ ఎన్నో రకాల చెట్లు ఉన్నాయి.

రామారావు ప్రకాశంతో కలిసి కొండమీదకూ, చెరువుగట్టుకూ ఏటి ఒడ్డుకూ షికారుకు అనేకసార్లు వెళ్ళి వచ్చాడు. ఒకటి రెండుసార్లు వారివెంట సావిత్రికూడా వెళ్ళింది. అలా వెళ్ళినప్పుడు సావిత్రి రామారావుతో ఇంతకుముందుకంటె ఎక్కువ చనువుగా, కలుపుగోలుగా మాటాడింది. ఎదుట కన్పించిన ప్రకృతిదృశ్యాలను ఎన్నో రకాలుగా అభివర్ణించి వాటిపట్ల తన ప్రగాఢమైన అభిమానం వ్యక్తం చేసింది అందుకు ప్రకాశం సంతో షించాడు

రామారావుకు మొదట్లో ఉన్న బెరుకు పోయింది. రాత్రిళ్ళు నక్కకూతలూ, దూరంనుంచి అడవిజంతువుల అరుపులూ వినిపిస్తే అతను ఇప్పుడు పూర్వంలాగా భయపడడం లేదు పైగా అతనికి నూతనోత్సాహం కలిగింది. బస్తీలో ఉన్నప్పటికంటె ఇక్కడకు వచ్చినతర్వాత తన ఆరోగ్యం ఎంతో మెరుగయిందని అనిపించింది అతనికి. ఒంటరిగా ఉంటున్న అతనికి మరికొంత ఉత్సాహం కల్పిద్దామనే ప్రకాశం అతన్నీ, సావిత్రినీ వెంట తీసుకొనివెళ్ళి, తను పెద్ద ఎత్తున కంట్రాక్టుపనులు చేస్తున్న ప్రదేశాలు చూపించాడు.

ప్రకాశం దాదాపు ప్రతిరోజూ పగలు అక్కడకూ ఇక్కడకూ వెళ్ళి వస్తూవుండేవాడు. పని ఉన్నా లేక పోయినా అలా వెళ్ళేవాడు.

కొన్నిరోజులతర్వాత సావిత్రి రామారావుతో మరింత చనువుగా మాటాడడం మొదలుపెట్టింది. మొదట్లో ప్రకాశం ఇంట్లో ఉన్నప్పుడే అతనితో అలా మాటాడేది ఇప్పుడు అలాకాదు; భర్త ఇంట్లో లేనప్పుడు రామారావు కూర్చునే గదిలోకి వెళ్ళి దూరంగా నిలబడి చాలాసేపు కబుర్లు చెప్పడం మొదలుపెట్టింది ఒకటికి రెండుసార్లు పండ్లు, ఫలహారాలు, కాఫీ, పాలు, ఓవల్టిన్ తెప్పించి ఇచ్చింది క్రమంగా లోకవ్యవహారాలతోపాటు తన సంసారానికి సంబంధించిన విషయాలుకూడా చెప్పడం ఆరంభించింది. మొదట్లో ప్రకాశం గుణగణాలు ఘనంగా ప్రశంసించింది. తర్వాత తర్వాత అతని లోపాలు ఎత్తి చూపుతూ సాధింపు ప్రారంభించింది

ప్రకృతిదృశ్యాలూ, ప్రశాంత వాతావరణమూ అంటే ఎంత అభిమానం ఉన్నా అంత ఆస్తి ఉండీ, అంత పెద్ద చదువులు చదువుకొనీ, అంత

పలుకుబడి సంపాదించి ప్రకాశం ఆ కుగ్రామంలో ఉండవలసిన అవసరం ఏమున్నదనీ, నగరంలో ఉంటూ, కావాలనుకున్నప్పుడు ఇటువంటి ప్రాంతాలకు వచ్చిపోకూడదా అనీ ఆమె వాదించింది. ఆమె ఆ విషయములో తన వాదంగురించీ, భర్తకు ఆ విషయం నచ్చచెప్పడానికి తను చేసిన విఫలప్రయత్నాలగురించీ వివరిస్తూ, బస్తీజీవితంపట్ల తనకు గల వ్యామోహం అభివ్యక్తం చేసింది.

మరికొంచెం చనువు ఏర్పడిన తర్వాత తానేమో సర్వాలంకార సంశోభితయై, అచ్చంగా అచ్చరలా కన్పిస్తూ, ఒయ్యారంగా, అంచకాల్ల అంచలా ముందు నడుస్తూ విశాలంగా అందంగా వున్న యిల్లంతా అతనికి ఒకటికిరెండుసార్లు చూపించింది.

ఆ యింట్లో ఎక్కడ చూచినా రకరకాల కుర్చీలు, బల్లలు, సామానులు; అవన్నీ ఖరీదైనవి. పెద్దనగరాలలో గొప్ప భాగ్యవంతుల ఇండ్లల్లో ఉండే సామగ్రు లవి. గోడల పైన అక్కడక్కడ అందమైన నగిషీపని చేసిన చట్రాలలో ఫొటోలు, ప్రకృతి దృశ్యాలు చిత్రించిన వర్ణచిత్రాలు; వాటిలో కొన్ని అజంతాచిత్రాల ప్రతిరూపాలు. అక్కడక్కడ బల్లల పైనా, టీపాయిలపైనా అపురూప కళాఖండాలు అమర్చిఉన్నాయి. ప్రతి గదిలోనూ విద్యుద్దీపాల ఏర్పాటు కూడా ఎంతో అందంగానూ ఆకర్షణీయంగానూ ఉన్నది.

ఆ యింట్లో దాదాపు పదిగదులు ఉన్నాయి. డాబాగదులు కాక వంటగదీ భోజనాలకూ వెనుక వేరే పెంకుటిల్లూ ఉన్నది. ఇంటివెనుక ఆవరణలో వంటఇంటికి దూరంగా పనివాళ్ళ కోసం కట్టిన చిన్నచిన్న పెంకుటిళ్ళు కూడా పొంకంగా ఉన్నాయి. పశువులశాలక్రింద నేల కొంతభాగం గచ్చు చేసి, పైన సిమెంటురేకులు వేసి, కట్టుదిట్టంగా కట్టారు. అందులో అయిదు ఆవులూ, దూడలూ, పదిగేదెలూ, పదిజతల ఎడ్లూ ఉన్నాయి.

ఇంటి వెనుకవైపు ప్రహరీగోడ ఎత్తుగా ఉన్నది. ముందువైపు ప్రహరీ గోడ ఎత్తు చాలాతక్కువ. ఇంటివెనుక గోడ ఆనుకొనే ఎకరంమేర తోట. అందులో పూలమొక్కలతో సహా రకరకాల చెట్లు ఉన్నాయి.

సావిత్రి ఇల్లూ, తోటా అంతా అతనికి చూపడానికి సంబరపడ్డది.

ఆవిడ తనకు రకరకాల నగలూ, ఆభరణాలూ,చీరలూకూడా చూపించి, ఏదోసందర్భంలో "ఇవన్నీ నాకేం తక్కువలేవు," అన్నది. అలా అంటూ ఆవిడ కొంత గర్వంకుండా కనబరచింది.

నవ్వుతూ, సరదాగా, చనువుగా

మాటాడుతూ సావిత్రి అతనికి ఇంకా ఎన్నో విషయాలు చెప్పింది.

"ఆయన బయట వాళ్ళతో వీళ్ళతో ఒక్కొక్కప్పుడు కోపంగా పరుషంగా మాట్లాడినా ఇంట్లో మట్టుకూ ఎప్పుడూ చక్కగా నవ్వుతూ మాటాడతారు. ఎప్పుడూ శాంతంగా ఉంటారు. ఎన్నెన్నో పుస్తకాలు కొనితెచ్చి చదువుకొంటుంటారు. అందమైన దారువిగ్రహాలూ, దంతపు బొమ్మలూ, గాజు, పింగాణీబొమ్మలూ, సామనులూ బోలెడు డబ్బుపోసి తెస్తారు. అవన్నీ నాకూ ఇష్టమే. అంటే క్రమంగా అభిమానం గలిగింది. అయితే ఒకటి – తను ఏంచేసినా కిమ్మనకూడదు. ఆయనకు అనుగ్రహం కలిగినా ఆగ్రహం వచ్చినా పట్టలేం. అల్లా అని ఆయన ఎన్నడూ దౌర్జన్యానికి దిగేమనిషి కాదు. అంతేకాదు, బయట తిరుగుడు కూడా ఉన్నది. కాని ఆయన నన్ను ఒకర్తెనే ప్రేమించాననని అంటారు. అది నిజంకూడానూ. వీటికి తోడు ఆయనకు తాగుడుకూడా అలవాటు అయింది. కాని ఆయన తాగుతారని ఎవ్వరూ అనుకోరు. తాగినంత మాత్రాన ఆయన తాగుబోతూ కాదు – తిరిగినంతమాత్రాన ఆయన తిరుగుబోతూ కాదు.

ఒక్కొక్కసారి ఆయిన ఇవన్నీ మరచిపోయి వారాలతరబడి ఎక్కడికీ వెళ్ళకుండా ఇంటిపట్టున ఉండి తోట పనులూ, వ్యవసాయంపనులూ చూచుకొంటారు 'వద్దండీ; డబ్బు ఇలా అనవసరంగా ఖర్చు చెయ్యొద్దు. తర్వాత మనంఇబ్బందిపడవలసివస్తుందేమో'అని నేను అన్నప్పుడల్లా ఆయన పిత్రార్జితమైన ఆస్తి ముట్టుకోవడం లేదనీ, పైగా అది ఎంతో పెరుగుతున్నదనీ, నేనుకనుక కొడుకుల్నీ కూతుళ్ళనూ కనేస్తే ఆ క్షణంనుంచీ ఇవన్నీ మానేసి వాళ్ళకోసం ఇంకా ఎక్కువ ధనం కూడబెడతాననీ అంటారు. మరి పదిసంవత్సరా లయింది. నాకు ఇంతవరకు అటువంటి అదృష్టం..."అంటూ ఆమె మాటాడడం మానేసి ఒక క్షణం మౌనం వహించి, అంతలో సిగ్గుపడిపోయి, చప్పున వెనుతిరిగి ఆవలకు వెళ్ళిపోయింది.

రామారావు అప్పటిదాకా తల వంచుకొని ఆవిడ మాటలు వింటూ కూర్చున్నవాడల్లా తల ఎత్తి ఆమె వెళుతున్నవైపు చూచాడు. మధ్యలో సంభాషణ ఆపేయడం, అలా సిగ్గుపడడం, చప్పున కొంగు లాక్కొని ఒళ్ళంతా కప్పుకొని, వెనుతిరిగి నెమ్మదిగా వెళ్ళడమదీ అతనికి ఒక చమత్కారంగా కన్పించింది.

ఆమె అలా వెళుతూ వెళుతూ వెనుతిరిగి తనవంక చూచి చిరునవ్వు నవ్వినట్లు అనిపించింది అతనికి. అలా



అనిపించేసరికి తనపైకి మల్లెపూలు విసరివేసినట్లు అయింది.

అదంతా ఒక్కక్షణం.

మళ్ళీ అంతలో ఆమె తనవంక చూచి అలా నవ్వలేదనీ. తలవంచుకొనే వెళ్ళిందనీ అతనికి జ్ఞాపకం వచ్చింది. అలా జ్ఞాపకం వచ్చేసరికి అతనిమనస్సు తలుక్కుమన్నది. విచ్చిన గులాబీపువ్వు ఉన్న రెమ్మఒకటి ఎవరో తనపైకి గురిపెట్టి సుతారంగా విసరగా, దారిలో పువ్వు రాలిపోయి రెమ్మ ఒక్కటే వచ్చి ముఖంమీద పడగా, సన్ననిముళ్ళు తన చెక్కిలిపై అలా ఒకసారి తాకినట్టు అయింది.

అతను అప్రయత్నంగా అరచేతితో ముఖం తుడుచుకొన్నాడు.

* * *

సావిత్రి రామారావుతో ఇలా చాలాసార్లు ఎంతోచనువుగా, ఏకాంతంగా సంభాషణ చేసింది. ప్రతిసారి ఆమె సంభాషణ ఎన్నడో చిన్ననాటి తమ స్నేహందగ్గర ప్రారంభమై,

అలా అలా అనుకోకుండా కొనసాగి, సంతానంవిషయందాకా వచ్చి ఆగి పోయేది. ఆమెకు సంతానం కలుగక పోవడానికి కారణం ఏమిటా అని అతను పదేపదే అనుకొన్నాడు. ఒకసారి వైద్యపరీక్ష చేయించుకోమని ఆమెతో చెప్పాలని అతను చాలాసార్లే అనుకొన్నాడు. కొన్నిసార్లు ఆ మాటలు నోటిదాకా వచ్చాయి కూడానూ కాని ఆమె అపార్థం చేసు కొంటుందేమో నని భయపడి ఊరు కొన్నాడు. ఆ విషయం ఆలోచించిన కొద్దీ అతనికి ఆమెపట్ల జాలి కలిగింది. హృదయంలో ఆమె అంటే ఉన్న అభిమానానికి అది తోడు అయింది. ఆమె ఎదుటకు వచ్చినప్పుడల్లా అతనికి ఆ విషయం జ్ఞాపకం వచ్చేది.

ముప్ఫయిఏళ్ళు నిండినా పిల్లలు కలుగకపోవటంవల్ల మనిషి చెక్కు చెదరలేదు ఎన్నడూ పనిపాటలు చెయ్యవలసిన అవసరం లేకపోవడం వల్ల ఆమె పరమసుకుమారవతి అయింది. ఆ సౌకుమార్యానికి సౌందర్యపోషణా, అలంకారాలూ తోడు అయాయి భాగ్యవంతుని భార్య కావటంచేత అందుకు అవకాశం కలిగింది.

ఆమె మోము ఎప్పుడూ మందహాస సుందరం. పున్నమనాటిచంద్రబింబ సదృశం.

ఎండకన్ను ఎరుగని దనిపిస్తుంది సావిత్రి. మల్లెకు ఆమె ప్రతిస్పర్ధి - లావణ్యంలోనూ, సౌకుమార్యంలోనూ కూడా.

'ఆమె చిన్నప్పుడు అంత అందకత్తె కాదు. వయసు వచ్చినప్పుడు వయసు వచ్చిన పిల్లమాత్రమే భర్త సాంగత్యం వల్ల ఇంత అందం వచ్చింది. మెరుపు వచ్చింది. తనూవిలాసం అబ్బింది. సానపట్టిన మకరాంకుశస్త్రం అయింది. సంపదవల్ల రకరకాల విలువైన అందాల ఆభరణాలు ధరించి కొత్త కొత్త అలంకరణలు చేసుకోడానికి మంచి అవకాశం కలిగింది నాగరికం నేర్చింది,' అనుకొన్నాడు రమారావు.

ఆమె సౌకుమార్యం అతన్ని ఆకర్షిం చింది. ఆమె అలంకరణ అతన్ని అలరించింది. ఆమె చనువు, నాగరికత, సంభాషణాధోరణి అతన్ని కవ్వించాయి.

ఆమె రోజూ చాలా ఖరీదైన జరీ అంచు పట్టుచీరెలే కట్టేది ఎప్పుడూ చక్కగా అలంకరిచుకొనే కన్పించేది నిత్యం ఉదయం సాయంత్రం తలలో పూలు దండిగా పెట్టుకొనేది. అదంతా తన్ను ఆకర్షించడానికేమో నని రామారావుకు అనుమానం కూడా కలిగింది.

సావిత్రి ఎప్పుడు అవకాశం దొరికినా ఏదో విషయంపై సంభాషణ అల్లుకొని

పోయేది. ఆవిడ ఎప్పుడూ ఎంతో మధురంగా మాటాడేది. ప్రకాశం ఇంట్లో ఉన్నంతసేపూ భార్యఎదురుగా కూర్చుని, ఆవిడమాటలు వినడానికి ఆసక్తి కన్పరచేవాడు. మధుర కావ్యగానం విన్నంతగా సంతోషించే వాడుకూడానూ.

ఆమె అలా ఏదో తనతో ఏకాంతంగా మాటాడుతుండగా రామారావు మధ్యలో అడ్డుకొని "ఇతర విషయాలు ఎలా ఉన్నా, మీరు మాటాడుతుంటే ఏదో పాట పాడుతున్నట్టు ఉంటుంది," అన్నాడు నెమ్మదిగా అలా అంటూ అతను ఆమెవంక ఒకసారి అభిమానపురస్సరంగా చూచాడు. అలా చూస్తూ అతను అప్రయత్నంగా మందహాసం చేశాడు.

ఆమె గమనించింది.

మొదట ఆమెకూడా అప్రయత్నంగా చిరునవ్వు నవ్వింది. అంతలో అతని మందహాసం కాంక్షాసమ్మిశ్రితం అనిపించింది ఆమెకు. మరుక్షణంలో ఆమె కావాలని చిరుకోపం ప్రదర్శించింది.

అంతలో ఆమె వెనుదిరిగి నెమ్మదిగా అవతలకు వెళ్ళిపోయింది.

* * *

అలా జరిగినతర్వాత రామారావు సావిత్రితో కొన్నిరోజులదాకా మాటాడలేదు ఆమె తన్ను ఒక విధంగా గట్టిగానే హెచ్చరించినట్లు, ఒకరకంగా మందలించినట్లు అనిపించింది అతనికి. అందుకే ఆమె ఎదుట పడ్డా అతను పలకరించలేదు. ఆమెను కన్నెత్తి చూడలేదు; తప్పుకొన్నాడు.

కాని...కాని...

ఆమె తలనిండా తాల్చిన మల్లెపూల సువాసనలు అతన్ని చుట్టివేస్తూనే ఉన్నాయి. ఆమె కాలిమెట్టెల సన్నసవ్వడులు అందెల రవళులై, మృదుమధుర ఝుంకారములై అతని హృదయంలో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. ఆమె చూపులు తుమ్మెదల బారులై అతన్ని మభ్యపెడుతూ మాటిమాటికీ మీదమీదకు వస్తూనే ఉన్నాయి.

అతని మనస్సంతా ఆమెనుగురించిన ఆలోచనలతో నిండిపోయింది సన్నని అగరువత్తులపొగ సర్వసుందరంగా అలంకరించిన శోభనపుగది అంతా అలముకొన్నట్లుగా, క్రొత్తగా వికసించిన పూలపరిమళం ఉద్యానవనమంతా పరివ్యాప్తం అయినట్లుగా ఆమె రూపలావణ్యం గురించీ, ఆమె చిరునవ్వుల సోయగం గురించీ, విలక్షణమైన ఆమె ఆకర్షణ గురించీ కలిగిన ఆలోచనలు అతని మనస్సు అంతా అలముకొన్నాయి. అవి అలవోకగా అలముకొన్నాయి. అతనికి అదే ధ్యాస అయింది. అతనికి అది ఒక వ్యామోహం అయింది.

ఆమెను కలుసుకోకుండా, ఆమెతో మాట్లాడకండా, ఆమెవంక చూడకండా అలా తప్పుకు తిరుగుతున్నకొద్దీ అతనికి ఆ వ్యామోహం అధికాధికం అయింది.

పదిరోజులు అలా గడిచేసరికి ఇంకా ఆమెను చూడకుండా ఉండలేనను కొన్నాడతను. అతనికి మనసులో బాధగా అనిపించిందికూడా. హృదయంలో ఎక్కడో మధుకీల రగుల్కొన్నట్లు అనిపించింది. ఆమె ప్రవర్తన అతనికి మరీ వింతగా కన్పించింది. ఆమెకూడా తనలాగే లోపల బాధ పడుతూ, పైకి తేలకుండా, తన ఎదుట పడకుండా తప్పించుకొని తిరుగుతున్నట్లు కన్పించింది.

ప్రకాశం ఇంట్లో ఉన్నప్పుడుకూడా సావిత్రి అలాగే ప్రవర్తించడం మొదలుపెట్టింది. ఏదో తప్పు చేసిన దానిలాగా దూరంగా తొలగిపోయింది. కారణం ఏమిటని ప్రకాశం అడుగుతాడేమో నని రామారావు భయపడ్డాడు. కాని సావిత్రి మాత్రం అటువంటి భయాలేమీ పెట్టుకోలేదు రామారావు తన్నేమో బాధిస్తున్నట్లు, రక్షణకోసమన్నట్లు ప్రకాశం ప్రక్కన చేరినట్లు కన్పించింది.

* * *

రామారావు అక్కడ ఉద్యోగరీత్యా నిర్వహించవలసిన పనులపట్ల ఎక్కువ శ్రద్ధ వహించాడు. తాను వుండవలసిన అవసరం లేకపోయినా పనికట్టుకొని వెళ్ళి చిన్నతరహా నిర్మాణ కార్యక్రమాలు అమలు జరుగుతున్న చోట ఎక్కువసేపు ఉండివచ్చాడు. అయినా అతనికి ప్రొద్దుపోలేదు· అక్కడ తాను ఒంటరిగా ఉంటున్నట్లూ, బొత్తిగా తోచకుండాపోయినట్లూ అతను బాధపడ్డాడు. అతను ఒకటిరెండుసార్లు ప్రకాశంతో కలిసి పెద్దఎత్తున కంట్రాక్టుపనులు జరుగుతున్నచోట్లకు వెళ్ళివచ్చాడు. అతనికి ప్రకాశం మళ్ళీమళ్ళీ ఆ ప్రదేశాలన్నీ చూపించాడు. ప్రకాశంతో అలా ఊరికే తిరగడం తప్ప రామారావుకు కాలక్షేపం కాలేదు

ప్రకాశం మితభాషి.

ఎవరైనా మాట్లాడుతుంటే ఎంతసేపయినా ఓపిగ్గా వింటాడు తను

రామారావు ప్రకాశంతో ఏదో విషయం మాట్లాడుతూ మధ్యలో స్వవిషయం ప్రస్తావించాడు. తనకు అక్కడ ఏమీ తోచడంలేదని చెప్పి, "నీ పలుకుబడి ఉపయోగించి నన్ను ఇక్కడనుంచి బదిలీ చేయించు," అన్నాడు.

ప్రకాశం నవ్వి ఊరుకున్నాడు.

రామారావు మళ్ళీ అడిగాడు.

ప్రకాశం నవ్వుతూ, "పోనీ, కొంచెం ఔషధం సేవిస్తావా?" అన్నాడు.

వెంటనే రామారావు "వద్దువద్దు," అంటే అతను పెద్దగా విరగబడి నవ్వుతూ, "అంత భయమా?" అన్నాడు. మరోక్షణం తర్వాత అతను మాట మారుస్తూ "ఇక్కడ తోచక పోవడం ఏమిటి? ఒకసారి అటు చూడు," అన్నాడు

ఎదుట ఎటు చూచినా సర్వరమణీయమయిన ప్రకృతి దృశ్యాలు. అక్కడి ప్రకృతి సౌందర్యం సందర్శిస్తూ హాయిగా ఎంతకాలమైనా గడపవచ్చు. ఇంటిదగ్గర ఏ గదిలో అయినా కూర్చుని చదువుకోవచ్చు. ఇంట్లో కావలసినన్ని పుస్తకాలు వున్నాయి. ఇంట్లోనో, తోటలోనో కూర్చుని బొమ్మలు గీయవచ్చు కవిత అల్లుకోవచ్చు. పాటలు పాడుకోవచ్చు గ్రామంలో ఎన్నో నిర్మాణ కార్యక్రమాలు నిర్వహించవచ్చు. ఇతనికి తోచకపోవడమేమిటి?' అనుకొన్నాడు ప్రకాశం. అతను కొన్ని నిమిషాల తర్వాత తల వంచుకొని కూర్చున్న రామారావు భుజంమీద చేత్తో తడుతూ, "పోన్లే, రేపటినుంచీ ఇంట్లో మనం చదరంగం ఆడుకొందాం," అన్నాడు.

ఆ మరునాటినుంచీ ఇంట్లో ఉన్నప్పుడు తీరికవేళల్లో ప్రకాశం రామారావుతో ఆట వేయడం మొదలు పెట్టాడు. కొన్నాళ్ళు అలా సాగింది.



అలా ఆట మొదలుపెట్టినరోజుననే ప్రకాశం అతనితో "నువ్వు కోరిన ప్రకారం గ్రామంలో భవననిర్మాణానికి మంజూరు సంపాదించాను ఇంక నీకు కావలసినంత పని," అన్నాడు

రామారావు సంతోషించాడు

'బయట చేతినిండా పని ఉంటుంది. ఇంట్లో ఆటమూలంగా కొంత కాలక్షేపం అవుతున్నది,' అనుకొని సావిత్రి విషయం మర్చిపోవడానికి ప్రయత్నించాడతను. ఇతర పనులయినా తనప్రమేయం లేకుండానే అతిశీఘ్రంగా జరిగిపోతున్నాయి కాని అతను అతికష్టంగా, రహస్యంగా చేస్తున్న ఆ ప్రయత్నం మాత్రం కొనసాగలేదు. అతను ఇంట్లో ఉన్నప్పుడు సావిత్రి ఆ చాయలకే రావడంలేదు. కాని అతనికిమాత్రం ఆమె ఎప్పుడూ తనముందే ఉన్నట్లు అనిపించింది

ఒకరోజు చదరంగం ఆట సాగుతుండగా ప్రకాశానికి బయటనుంచి పిలుపు వచ్చింది. కాని ప్రకాశం ఆటలోనుంచి లేవలేదు. ఆ వచ్చిన మనిషి లోపలకు వెళ్ళి, ఆ విషయం సావిత్రితో చెప్పి, ప్రకాశం వెంటనే అక్కడకు రావలసిన అవసరంగురించి వివరించాడు. సావిత్రి ఆ మనిషిని పంపి, కొన్నిక్షణాలతర్వాత వంటమనిషిని పిలిచి, రెండుకప్పుల కాఫీ తీసుకొని వెళ్ళి ముందుగదిలో ఇచ్చిరమ్మని చెప్పింది. ఆవిడ వెళుతుండగా ఆయన్ను ఓసారి ఇటు వచ్చివెళ్ళమని చెప్పండి అనికూడా అన్నది సావిత్రి

పదినిముషాల తర్వాత ప్రకాశం అక్కడకు వచ్చేసరికి సావిత్రి ఆ గదిలో పెద్ద పందిరిమంచంమీద పడుకొని ఉన్నది. అతను లోపలకు వస్తూనే ఆటలో ఉండగా పిల్చినందుకు కొంచెం కోపగించుకొంటూ, "ఎందుకో రమ్మన్నావుట," అన్నాడు.

సావిత్రి మాటాడలేదు.

వైగా మరో వైపు తిరిగి పడుకున్నది.

అతను కొంచెం విసురుగా ముందుకు వచ్చి ఆమె బుజాలు పట్టుకొని తన వైపుకు త్రిప్పుకొంటూ కొంచెం పెద్దగా, "ఏం, ఆటలో ఉన్నానని కూడ తెలియదా నీకు ?" అన్నాడు

సావిత్రి ఫక్కున నవ్వింది. ఆమెవంక ప్రకాశం కొంచెం కోపంగా చూస్తూ, "ఎందుకలా నవ్వుతావ్ ?" అన్నాడు.

"మీరు చేతులు విడిచిపెట్టండి. నాకు చక్కలిగింతగా ఉన్నది," అన్నది, సావిత్రి నెమ్మదిగా లేచి కూర్చుంటూ.

"అబ్బ ! అంత చిన్నపిల్లవేం !" అన్నాడు ప్రకాశం

ఆమె అతని ముఖంలోకి చూస్తూ, చిరునవ్వు నవ్వుతూ, "కాక ముసలిదాన్నా," అన్నది. అతనికి కోపం అంతా పోయింది.

కొన్నిక్షణాల తర్వాత అతను, "సరేగాని, పని ఏమిటో చెప్పు," అన్నాడు.

ఆమె లేచి నెమ్మదిగా అతని దగ్గరగా వచ్చి నిలబడి, "అబ్బే, ఏం లేదు; మీరు వెంటనే అక్కడకు వెళ్ళక పోతే అక్కడ పని ఆగిపోతుందట దానివల్ల మనకు చాలా నష్టం వస్తుం దటకూడాను. అదీకాక అనుకొన్న నాటికి పని యథావిధిగా పూర్తి కాకపోతే మీకు అందరిమీదా కోపం వస్తుంది. ఇవన్నీ నాకు తెలుసు. అందువల్ల మీరు ఒక్కసారి అలా వెళ్ళిరండి," అన్నది. అతను ఒక్క నిముషం అక్కడే నిలబడి ఎటో చూస్తూ ఆలోచనలో పడ్డాడు అంతలో అతను ఆలోచనలోనుంచి తెప్పరిల్లుకొని "నిజమే; నువ్వు బాగా జ్ఞాపకం చేశావు. ఇవ్వాళ చాలా అర్జంటుపనే ఉన్నది. సరే వెళతాను. అయితే ఓపని చెయ్యి. ఆట పూర్తిచేసివెళ్ళు," అన్నాడు.

ప్రకాశం హడావిడిగా బయటకు వెళ్ళాడు.

సావిత్రి నెమ్మదిగా, తీరుబడిగా ముందుగదిలోకి వచ్చి ఆట ముందు కూర్చుంది.

వచ్చిన పదినిముషాలకే ఆట కట్టించేసింది సావిత్రి. ప్రకాశం ముందు వెయ్యవలసిన ఎత్తులన్నీ చెప్పివెళ్ళాడనుకొన్నాడు రామారావు అతనికి కోపం వచ్చింది. మాటామంతీ లేకుండా మరోఆట వేశారు. అదీ అంతే అయింది. రామారావుకు రోషంకూడా వచ్చింది. వెంటనే మరోఆట వేశాడు. ఈసారి అతను ప్రతిఎత్తుకూ ఎంతోవ్యవధి తీసికొన్నాడు. కాని చివరకు గెలుపు ఆమెదే అయింది.

ఇక ఆరోజునుంచి ప్రకాశం ఇంట్లో ఉన్నప్పుడూ లేనప్పుడూ కూడా సావిత్రీ, రామారావూ అలా ఒకటి రెండు ఆటలు వెయ్యడం జరుగుతూ వచ్చింది.

మొదట కొన్నాళ్ళు అతను ఆమె వంక కన్నెత్తి చూడలేదు. తర్వాత తర్వాత అందుకు అతనికి ధైర్యం వచ్చింది. ఆమె చూడనప్పుడు అతను ఆమెవంక చూడడం, ఒకరికొకరు పట్టుబడడం, తల వంచేసుకోవడం, ఎంత సేపూ ఎత్తు వెయ్యకపోవడం, ఏదో తప్పు చేసినట్లు పశ్చాత్తాప పడడం చాలాసార్లు జరిగింది.

అది రోజూ పరిపాటి అయింది

ఆరోజు ప్రకాశం తూర్పు తెలతెలవారకముందే నిద్రలేచి హడావిడిగా స్నానాదులు పూర్తి చేశాడు. ఆరుగంటలు కాకముందే ఫలహారం చేయించుకొని తిని, కాఫీ తాగి బయలుదేరాడు. వెళుతూ వెళుతూ సావిత్రితో చెప్పివెళ్ళాడు అన్ని విషయాలూ క్లుప్తంగా.

కొండ ప్రక్కగా క్రొత్తగా వేస్తున్న రోడ్డుపని దాదాపు పూర్తి అయింది. ఆ గ్రామాన్ని బస్తీతో కలుపుతూ వేసినరోడ్డు అది. దారిలో అక్కడక్కడ చిన్నచిన్న వంతెనల నిర్మాణం కూడా పూర్తి అయింది కాని అక్కడా ఇక్కడా కొన్ని చిల్లరపనులు మిగిలి పోయాయి. అవన్నీ ఆపూట పూర్తి అవుతాయి. అంత పెద్ద కంట్రాక్టుపని పూర్తి అయినసందర్భంగా పట్టణంలో పెద్ద విందు ఏర్పాటుచేశాడు ప్రకాశం. అతను చాలామంది పెద్దవాళ్ళను ఆ విందుకు ఆహ్వానించాడు.

విందుకు సాధ్యమైనంత ముందుగా రమ్మనమనీ, మూడింటికే ఇంటికి కారు వస్తుందనీ, పెద్దగా అభ్యంతరం లేదంటే రామారావునుకూడా తీసుకొనిరమ్మనీ సావిత్రితో చెప్పివెళ్లాడు ప్రకాశం.

సావిత్రి గుమ్మందాకా వచ్చి అతన్ని సాగనంపుతూ, "పోనీ మీరే ఆయన్ను స్వయంగా పిల్చివెళ్ళకూడదూ! అదీకాదూ ఇప్పుడే వెంటతీసుకొనివెడితే మరీ సంతోషిస్తారేమో ఆయన," అన్నది

ప్రకాశం ఒక్కక్షణం ఆగాడు

అవును మంచిమాటే చెప్పావు కాని ఇది వ్యవహారం. దీనివల్ల అందరికీ ఉపయోగమే. అయితే మనకు ఎక్కువలాభిస్తుంది. అందువల్ల తప్పనిసరిగా కొందరికి కొంతకొంత ముట్ట చెప్పాలి. ఇటువంటివన్నీ అతనికి గిట్టవు. అదీ కాక విందుకు వచ్చేవాళ్లల్లో కొందరు అతని పైఅధికారవర్గంలోని వారు కావచ్చు. అందువల్ల అతను భయపడి రాకపోవచ్చు. సరే ఇవన్నీ ఎందుకులే–మన ఇద్దరిలో ఎవరు పిలిస్తే ఏముందీ, రమ్మను. వస్తేతీసుకొనిరా," అని అతను గబగబా ముందుకు నడిచాడు.

సావిత్రి ఆపూట ఉదయం పదిగంటలనుంచే హడావిడిపడ్డది తలంటిపోసుకొని, జుట్టు బాగా తుడుచుకొని, బాగా ఆరాక, వదులుగా జడ వేసుకొన్నది మధ్యాహ్నం పెందరాళే భోజనం చేసి కాసేపు విశ్రాంతి తీసుకొన్నది రెండుగంటలకు రామారావు ఆటకు కూర్చుంటే, సావిత్రి అక్కడకు వచ్చి ఎంతో ఒయారంగా నిలబడి, "ఇంక నేను ఈ మూగనోము సాగించలేను. మీరూ మాటాడండి," అన్నది. మరోక్షణం తర్వాత ఆమె అతనికి ఎదురుగా ఉన్న చదరంగం ఆడే అట్టా, పావులూ తీసి ప్రక్కగా పెట్టి, కుర్చీ లాక్కొని అతనికి ప్రక్కగా కూర్చుని ప్రకాశం పూర్తిచేసిన రోడ్డునిర్మాణం గురించి వివరిస్తూ, దానివల్ల గ్రామం త్వరలో ఎంతో అభివృద్ధి చెందుతుందనీ, బస్సులుపడే అవకాశం ఉన్నదనీ, తను కారులో అనుకొన్నప్పుడల్లా




బస్తీకి వెళ్ళిరావడానికి పిలవుతుందనీ అన్నది. కొండప్రక్కగా గ్రామం వైపునా, కొండవెనుక గ్రామానికి దూరంగానూ ఉన్న భూములకు ఇలా రోడ్డుసౌకర్యం కలగడంమూలంగా గిరాకీ పెరుగుతుందనీ, అందులో చాలా భాగం అయిదారు సంవత్సరాల క్రిందట ప్రకాశం చవగ్గా కొనడం జరిగిందనీ చెప్పింది. ఆ భూములు వ్యవసాయంక్రిందకు తీసుకొనిరావడానికి కృష్ణాజిల్లానుంచి కొందరు రైతులను వారి కుటుంబాలతోసహా ఆ గ్రామానికి తరలించకొనిరావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయనీ, ఆ బృహత్కార్యక్రమానికి ప్రభుత్వ సహాయంకూడా తప్పక లభిస్తుందని తనూ, ప్రకాశం గట్టిగా ఆశిస్తున్నామనీ అంటూ సావిత్రి తన భర్త ఆదర్శాలనుగురించి విపులీకరించింది.

రామారావు ఓపికగా విన్నాడు.

అవీ ఇవీ చెప్పి చివరకు విందుకు తనతో రమ్మని ఆహ్వానించింది సావిత్రి.

అతను రానన్నాడు.

ఆమె బలవంతంచేసింది.

కాని అతను రానంటే రానన్నాడు. ఆయన స్వయంగా పిలవలే

దని కోపమా అన్నది. ఎందుకు మీ అధికారు లెవరైనా వస్తారని భయమా అన్నది మీకు అంత అర్జంటుపనులు ఏమన్నా ఉన్నాయా అన్నది. నాతో ఒంటరిగా కారులో రావడానికి అభ్యంతరమా అన్నది. అన్నింటికీ అతను కాదన్నాడు. మరయితే రావడాని కేమని ఆమె అంటే,అతను రానని మాత్రమే అన్నాడు. పోనీ కారు మళ్ళీ పంపమంటారా అని అడిగితే, వద్దన్నాడతను.

"మీ రివ్వాట నాతో రావడమే బాగుంటుంది. ఎవరైనా ఏమైనా అనుకొంటారేమోనని భయపడవలసిన అవసరం ఎంతమాత్రమూ లేదు." అని ఆగింది క్షణంతర్వాత నెమ్మదిగా "ఆయనకు ఇటువంటి పట్టింపు లేమీ లేవు ఉంటే మీరు ఇక్కడ ఇన్నాళ్ళు ఉండే అవకాశం లభించేదే కాదుకదా! అదీకాక ఇల్లాంటి సందర్భాలలో ఆయన హడావిడిగా ఉంటారు. నాతో ఎక్కువ మాటాడే అవకాశం ఉండదు. మీరు వస్తే మనం కాస్త మాటాడుకొంటూ ఉండవచ్చు," అనికూడా అన్నది సావిత్రి.

అన్నీ విని రామారావు రానన్నాడు.

సావిత్రి ఒంటరిగా వెళ్ళడానికే సిద్ధపడ్డది. ఆవిడ మూడింటికే ముస్తాబు అయింది. నాలుగింటికి కారు వచ్చింది. సావిత్రి బయలుదేరివెళుతూ అతని గదిలోకి వచ్చి, "సరే, మీరు రానట్లేకదా! మరి నేను వెళ్తున్నాను రాత్రికి మా కోసం ఎదురుచూడకండి మేంరావడం బాగా ఆలస్యం కావచ్చు. మీరు పెందరాళే భోజనం చేస్తారని వంటావిడతో చెప్పివెళుతున్నా," నని నెమ్మదిగా, ఒయారంగా అడుగులో అడుగు వేసుకొంటూ నడచివెళ్లింది కారుదగ్గరకు.

* * *

సావిత్రి బయటకు వెళ్ళినప్పటినుంచీ రామారావుకు తోచలేదు. ఊళ్ళోకి వెళ్ళి అక్కడ పనులు ఎలా సాగుతున్నదీ చూచివచ్చాడు. సాయంత్రం తోట అంతా ఒకసారి తిరిగివచ్చాడు. కొంతసేపు ముందుగదిలో కూర్చుని అక్కడ కన్పించిన మాసపత్రికలూ, పక్షపత్రికలూ, వారపత్రికలూ, దినపత్రికలూ-ఇంగ్లీషువీ, తెలుగువీ అన్నీ తిరగేశాడు. లోపలనుంచి ఓ పుస్తకం తెచ్చుకొని చదవడానికి ప్రయత్నించాడు ఆ ప్రయత్నం విఫలమైంది. మనసు ఎందుకో ఆరాటపడుతున్నట్లు అనిపించింది అతనికి. 'ఛ, ఏమిటిది!' అనుకొన్నాడు. 'అయినా ఈ ఊళ్ళో నాకీ ఉద్యోగం ఏమిటి? కావాలని కల్పించుకొంటేకాని పనిలేదే; ఇక్కడకు నన్ను పంపించారేమిటి? అని బాధపడ్డాడు 'సావిత్రి నాతో అలా మాటాడకుండా ఉంటేనే బాగుంది-ఉండిఉండి మళ్ళీ

ఎందుకివాళ మాటాడిందో!' అనుకొని మహా గింజుకొన్నా డతను. ఎన్నెన్నో ఆలోచనలు అతన్ని పరిపరివిధాల కలవరపెట్టాయి కొన్ని ఆలోచనలు అతన్ని భయపెట్టాయి. మరికొన్ని అతన్ని రెచ్చకొట్టాయి. ఒకసారి ఎవరికీ చెప్పకుండా అప్పటికప్పుడు బయలుదేరి అక్కడినుంచి పారిపోవాలనికూడా అనిపించిం దతనికి

రాత్రి ఎనిమిదికూడా కాకముందే భోజనానికి రమ్మని పిలుపు వచ్చింది. అతను వెళ్ళలేదు. మళ్ళీమళ్ళీ పిలుపు వచ్చింది ఆ పూట భోజనం చెయ్యననీ, ఏవైనా పళ్ళూ పాలూ పంపమనీ నౌకరుచేత వంటమనిషికి కబురుచేశాడతను. ఆ పూట వాటితోనే సరిపెట్టుకొన్నాడు తన గదిలోకి వెళ్ళి పడుకొన్నాడు. అరగంట తర్వాత మళ్ళీ చావడిగదిలోకి వచ్చి అక్కడ సోఫాలో విశ్రాంతిగా కూర్చుని నిద్రపోడానికి ప్రయత్నించాడు.

తొమ్మిది కావస్తుండగా నౌకర్లంతా ఒకొళ్ళొకళ్ళే నెమ్మదిగా వెనక ఇళ్ళల్లోకి వెళ్ళారు. అతను ఒంటరిగా అక్కడే కూర్చుని కళ్లు గట్టిగా మూసుకున్నాడు. పది అయింది. పదకొండు అయింది. కాలంకంటేముందుగా పరుగెత్తుతోంది అతని మనస్సు. అతనికి ఎంతకూ నిద్ర రాలేదు.

సావిత్రికూడా రాలేదు.

పన్నెండు గంటలు కొట్టింది, అతనికి ఎదురుగా వున్న గోడగడియారం. అతను నెమ్మదిగా లేచి తన గదిలోకి వెళదా మనుకొంటుండగా ఒక్కసారి గుప్పున అత్తరువాసన వచ్చింది. అంతలో వేయిమల్లెల నవపరిమళం అతన్ని ముంచెత్తింది. మరుక్షణంలో వెల్లివిరిసిన గులాబీల గుబాళింపు– సువాసనల వెల్లువలవెనుక గాజుల గలగలలు – కాలిమెట్టెల సన్న సవ్వడులు. నవ్వుతూ, హడావిడిగా, అర్భాటంగా ఆ చావడిలోకి వచ్చింది సావిత్రి.

అక్కడకు చాలా ఆర్భాటంగా వచ్చింది సావిత్రి.

ఉద్యానవనంలోకి క్రొత్తగా వసంతం వచ్చినట్లుగా వచ్చింది ఆమె. క్రొత్తగా వయసువచ్చిన ఆడపిల్లకు ఎక్కడలేని అందం అంతా ఒక్కసారే వచ్చినట్లుగా వచ్చింది ఆమె పండుగకు పుట్టింటికి వెళ్ళి పట్టుచీర కట్టుకొని, ఆర్భాటంగా అత్తవారింటికి తిరిగివచ్చిన క్రొత్తకోడలులా వచ్చింది సావిత్రి.

వస్తూనే అతన్ని చనువుగా పలకరించిం దామె. "మీరు రాలేదుకాని, విందు బాగా జరిగింది చాలా సరదాగా గడిచింది," అన్నది ఆమె

విందు గొప్పగా జరిగింది.

సావిత్రి ఎంతో సంతోషించింది.

ఆమె సంతోషంతో అంతలా పొంగి

పోవడానికి మరో కారణంకూడా వున్నది. విందుకు వచ్చినవాళ్ళలో కొందరు ఆమె వంక కన్నార్పకుండా చూచారు కొందరు ఆడవాళ్ళుకూడా ఆమెను ఎన్నోవిధాల మెచ్చుకున్నారు అందరి కళ్ళూ ఆమెమీదే ఉన్నా యని పించింది ప్రకాశానికికూడా. అతను కూడా అందరిముందూ ఆమె అంద చందాలు అభినందిస్తూ, "ఏమిటి, ఇవ్వాళ ఇంత అందంగా కనిపిస్తు న్నావ్? క్రొత్తకళ వచ్చింది నీ ముఖ ములో," అన్నాడు. ఆ మాటలకు సావిత్రి ఉబ్బిపోయింది. అంతేకాదు, కొన్ని నిమిషాల తర్వాత అతను, ఆమె ఒంటరిగా కన్పించినప్పుడు, ఆమె కళ్ళ ల్లోకి చూస్తూ, "నిజం సావిత్రీ! నువ్వు ఇవాళ చాలా క్రొత్తగా వున్నావ్. అదుగో ఆయన చూడు రాజుగారు; ఆయన స్వయంగా నన్ను అడిగారు, 'ఎవ రావిడ' అని ఆశ్చర్యంగా. నేను చెప్పాను. నీకీ మధ్య పతిభక్తి ఎక్కువ అయింది. దాని ఫలితమా ఏమిటిది?" అన్నాడు.

సావిత్రి మొదట సిగ్గుపడ్డది.

ఆమె లోలోపల గర్వపడ్డది కూడానూ.

అంతలో అక్కడకు ఎవరో వచ్చారు. ప్రకాశం ఆయన్ను తీసు కొని అవతలకు వెళ్ళాడు.

విందుకు వచ్చిన ముఖ్య అతిథికూడా సావిత్రిని అభినందించాడు. ఆయన తన దగ్గరవున్న గులాబీదండ లన్నీ ఆమెకు కానుకగా ఇచ్చాడు. అలా ఇస్తూ, 'ఇవి ఆమె దగ్గర ఉంటే ఆమె సహజ సౌందర్యానికి నవపరిమళం అబ్బినట్టు అవుతుం,' దనుకున్నా నన్నా రాయన చిరునవ్వు నవ్వుతూ ఆయన పాశ్చాత్య దేశాలలో పర్యటించి వచ్చిన ప్రముఖ పారిశ్రామికవేత్త. ప్రకాశానికి ఆయన సన్నిహితమిత్రుడుకూడానూ ఆయన అభిమానానికి సావిత్రి మరింత గర్వ పడ్డది.

మరికొంతసేపైన తర్వాత ప్రకాశం సావిత్రిని ప్రక్కవసారోలోకి పిల్చి, వెంట తీసుకొనివచ్చిన కళాకారుణ్ణి ఆమెకు పరిచయం చేస్తూ, "ఈయన పేరు రాజుగారు; చాలా గొప్పవాడు. ఆయన మంచివక్త-గొప్పకవి. అంత కంటే గొప్ప చిత్రకారుడు. ఆయనకు నిన్ను చూచి చిత్రం గీయాలని అభి లాషకలిగింది ఆయనకు అటువంటి అభి ప్రాయం కలగడమే గొప్ప అదృష్టం. ఒక్కసారి అలా కూర్చో. ఆయన నీ బొమ్మ గీస్తారు. నువ్వే ఆశ్చర్యపడ తావు. నేను ఆయన వేసిన సుప్రసిద్ధ చిత్రాలు కొన్ని ఇంతకు పూర్వం చూచాను," అని చెప్పి తిరిగి అతిథుల దగ్గరకు వెళ్ళాడు.

ఆయన దూరంగా నిల్చున్నారు.

ఆయన ఖరీదైన గ్లాస్గో ధోవతీ



కట్టాడు. పల్చని సిల్కులాల్చీ వేశాడు. జరీ కండువా వల్లెవాటుగా వేసుకొన్నాడు. నొక్కులనొక్కుల పెద్ద క్రాపు చక్కగా దువ్వుకొన్నాడు తాంబూలం సేవిస్తూ విడవకుండా ధూమపానం చేస్తున్నాడు ఆయన ఎంతో నిర్భయంగా ఆమె వంక చూచాడు. 'ఆ చూపులో ఎంత ప్రగాఢమైన ఆకాంక్ష' అనుకొన్నది సావిత్రి. ఆయన చూపులతో ఆమెను వేధించాడు. ఆమెకు మొదట కోపం వచ్చింది. మరుక్షణంలో ఏదో బాధగా అనిపించింది ఆమెకు ఆమెకు ఆయనలో ఏదో విలక్షణమైన ఆకర్షణ కన్పించింది. అంతంలో ఆమె హృదయము పరవళ్లు త్రొక్కింది. లోలోన అణగిమణగి దాగివున్న ఓ కానొక భావం రెచ్చగొట్టబడినట్లు అనిపించింది ఆమెకు. ఆయన ఆమెను చూచి నవ్వాడు. ఆమెకు పరమానందం

కలిగించింది. చిత్రంగా ఆమెవంక చూచి వెక్కిరించాడు; కవ్వించాడు. "కూర్చోండి," అన్నాడాయన ఆమె కూర్చున్నాక ఆయన ముందుకు వచ్చి ఆమెవంక కొన్నిక్షణాలు కన్నార్ప కుండా చూచాడు. ఆమెలో ఏమో విద్యుద్దీపాలు వెలిగించినట్లు అయింది. ఆయన ఆమె కళ్ళల్లోకి ఒకసారి విచిత్రంగా చూచాడు. ఆమెలో ఏదో మధుకీల రగుల్కొన్నట్లు అయింది. ఆయన ఆమెను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూచాడు. అతిశీతల జల సమృద్ధమైన సరోవరంలో దిగినప్పుడు సర్వశరీరం జివ్వున ఒకసారి జలదరించినట్లు అయింది ఆమెకు. ఆయన ఆమె చుట్టూ చూచాడు, ఏదో చమత్కారంగా. ఒకసారి హఠాత్తుగా అర్ధలిప్త కాలం చప్పున గట్టిగా ఆలింగనం చేసుకొని విడిచిపెట్టినట్లు అయింది ఆమెకు.

ఆయన ఆమెకు ఎదురుగా కుర్చీలో కూర్చొని కొంతసేపు కళ్ళు మూసుకొన్నాడు. ఆ తర్వాత ఒక డ్రాయింగు కాగితముపై ఆమె ముఖచిత్రం గీచాడు. ఆ చిత్రం చూచి ఆమె ఆశ్చర్య పడ్డది ఆయన ఆ చిత్రం ఆమెకు ఇస్తూ, "మీరు క్షమించాలి. నావల్ల అపరాధమే జరిగింది. ఆ విషయం ఇప్పటిదాకా నాకూ తెలియదు. ఇంక నే నటు రాను. మీరు నాకో ఉపకారం చెయ్యాలి. నే నిలా వెళ్ళినట్టు కొంత సేపుదాకా ఎవ్వరితో చెప్పకండి," అన్నాడు.

అలా అని ఆయన గబగబా బయటకు వెళ్ళిపోయాడు.

సావిత్రి ఆ చిత్రం అందరికీ చూపింది. అందరూ సంతోషించారు. ఆ చిత్రంమిషతో ఆమె అందచందాలు ప్రశంసించారు. ప్రకాశం రాజుగారిని ఘనంగా సన్మానిద్దామని అనుకొన్నాడు; కాని ఆయన కన్పించలేదు.

* * *

సావిత్రి రామారావుకు ఎదురుగా నిలబడి విందువిశేషాలు వివరించింది. అతను ఆమెవంక కన్నార్పకుండా చూస్తూ వుండిపోయాడు.

రవ్వల దుద్దులవంక, రాళ్ళ నెక్లెస్ వంక, పట్టుచీరవంక, తలలో మల్లెపూల చెండ్లవంక, చేతిపై పేర్చుకొని తెచ్చిన గులాబీ పూలమాలల వంక అలా చూస్తూన్నాడని అనుకొన్నది ఆమె మొదట కాని మరుక్షణంలో అతను తన ముఖంవంకే, తన కళ్ళల్లోకే అలా చూస్తున్నాడని ఆమెకు స్పష్టమయింది అతను దిగ్భ్రాంతి చెంది, మైమరచి, కళ్ళు వప్పగించి చూస్తున్నాడు. తన సర్వ సౌందర్యం వెన్నెలగా మార్చి తానేమో చకోరంగా మారి వెన్నెలను తనివితీర గ్రోలుతున్నాడా అని

పించింది ఆమెకు. అలా అనిపించేసరికి ఆమెకు పట్టరానంత సంతోషం కలిగింది. ఆమె సంతోషంతో పొంగిపోతూ, చిరునవ్వు నవ్వుతూ, అప్రయత్నంగా ముందుకు వచ్చి చనువుగా అతని రెండు చేతులూ పట్టుకొని, "ఏమిటి ఇవ్వాళ అంతా నా వంక ఇలా చూస్తున్నారు?" అన్నది. మెత్తని ఆమె అరచేతుల మృదుస్పర్శకు అతను నిలువునా పులకించిపోయాడు. అలా స్పర్శ కలిగినంతసేపూ అతని మనస్సు పరవళ్ళు తొక్కింది. మనసు ఆకర్షణకు లొంగిపోయింది. అప్పటివరకు మనసును అదుపులో పెట్టుకొందామనే అనుకొన్నాడతను వ్యామోహాన్ని జయిద్దామనే అనుకొన్నాడు, కాని అదంతా ఆమె చేతి స్పర్శ కలగనంతసేపే. ఆమె తాకిన వెంటనే జయాపజయాల ప్రశ్నే లేకుండాపోయింది. అతనికి మనస్సంతా మబ్బు క్రమ్ముకొనిపోయింది. ఆవేశం మైకంలా వస్తున్నట్లుకూడా అనిపించింది

ఆ ఆవేశం చిత్రమనిపించింది.

ఒకసారి బలద్విషసర్పం తనను క్రమంగా చుట్టేసుకొనిపోతూ, నిలువునా నులిమివేస్తున్నట్టు ఉన్నది. ఒకసారి మహానదిలో జలప్రవాహం తనను సుడిగుండంలోకి లాక్కొనివెళ్ళి, గిరగిరాత్రిప్పి, కళ్ళు తిరుగుతున్న సమయంలో, తనను అమాంతం ఏ పాతాళానికో అదిమివేస్తున్నట్టున్నది. ఒకసారి ప్రళయపవనాల వేగాన దారం తెగిన గాలిపటంలా తను కొట్టుకొనిపోతున్నట్టు ఉన్నది. ఒకసారి పెను సుడిగాలిలో తవిలి కొన్ని క్షణాలు గిఱ్ఱున బొంగరంలాగా తిరిగి, అంతలో ఆకాశంలోకి అంతఎత్తుకు రావిఆకులా ఎగసి దూరదూరాలకు కొట్టుకొనిపోతున్నట్టున్నది. వింతవింత వైవశ్యం కలిగింది అతనికి. అంతులేని ఆనందం అర్ణవమే ఐంది.

ఒకనిముషం తర్వాత అతని చేతుల స్పర్శకు ఆమెకూ అలానే అనిపించింది. ఊహాలోకంలో, మధురమైన స్వప్న జగత్తులో హాయిగా స్వేచ్ఛగా విహరిస్తున్నట్టు అనిపించింది ఆమెకు. ఆమె ఎంతసేపైనా అలాగే ఉండిపోయేదేమో! కాని... కాని అతనికి ఆవేశం పట్టరాకపోయింది. అతను ఆమెచేతులు విడిపించుకొని ఆమెబుజాలు స్పృశించబోయాడు. ఒక్కవేటున ఆమెను తనపైకి లాక్కొని గాఢాలింగనంలో బిగించేవాడే!

అతను అందుకు ఉద్యుక్తుడు అయాడుకూడానూ.

ఆమెకు చప్పున మెలకువవచ్చినట్టు అయింది. మరుక్షణంలో దూరంగా జరిగి "అరే ఏమిటిది?'' అంటూ ఆమె వెనుతిరిగి నెమ్మదిగా నడిచి, కిటికీ

దగ్గరకు వెళ్ళి, కొంతసేపు బయటకు చూస్తూ నిలబడ్డది.

బయట చక్కని చిక్కని వెన్నెల. ఆకాశం స్వచ్ఛంగా ఉన్నది. ఎంతో గంభీరంగా ఉన్నది. వియత్తలనుంచి పాలధారలు కడుతున్నట్లు వెన్నెల కాంతులు ప్రసరిస్తున్నాయి. వెలుగు వాగులై ప్రవహిస్తున్నాయి. వెన్నెల సర్వప్రపంచాన్నీ ముంచెత్తుతోంది. ప్రకృతి సమస్తం వెన్నెలలో తడిసి పులుకడిగిన ముత్యంలా క్రొత్త మెరుపుల్తో వింతసొగసులు పోతున్నది.

తోటఅంతా నిశ్శబ్దంగా ఉన్నది మూగనోము పట్టిన ముగ్ధలా ఉన్నది తోటలో మలయమారుతప్రసారానికి మల్లె, మాలతి, సన్నజాజులు తలలూపుతున్నాయి. ఆ పువుదోట బాటలకు ఇరుప్రక్కలా పొదరిండ్లు గుసగుసలు పోతున్నాయి. ఉండి ఉండి సుమ పరిమళం గుప్పున నలువైపులా ఎగ చిమ్మినట్టు ఒకసారి పైకెగసి ఉద్యాన వన మంతటా పరివ్యాప్త మవుతోంది ఊరికి కొంచెందూరంగా ప్రవహిస్తున్న సెలయేటి నీటిఅలల గలగలలు వెన్నెల రూపు గొన్న అభిసారికల కాలిఅందెల రవళులలా వినిపిస్తున్నాయి. గాలి తాకున కొమ్మల రెమ్మల కదలికల వలన వెలువడిన సన్నసవ్వడులు విరహిణుల వేడినిట్టూరులలా వినిపిస్తున్నాయి.

వెన్నెలను చూచి సావిత్రి మురిసిపోతూ, చిరుగాలికి రేగి ముఖంపై పడుతున్న ముంగురులు సవరించుకొన్నది.

మల్లెపూల నవపరిమళం మత్తెక్కించే మరువంతావి, సంపెంగల సువాసనలు మెల్లగా వీచే చల్లని గాలులతో కలిసి వచ్చాయి. గాలులు మెలమెల్లగా వీచినప్పుడవి వేరువేరు సువాసనలు అనిపించాయి. అంతలో గాలి గట్టిగా వీచింది. ఆసువాసనాలహరులన్నీ కలిసి పోయాయి. వాటి సమాహారపరిమళం మరికొత్తగా ఉన్నది.

అతను ఆమెవంకే చూస్తూ ఉండిపోయాడు. ఆమె వెనుతిరిగిచూడలేదు.

కొంతసేపుతర్వాత తను నెమ్మదిగ 'సావిత్రీ' అన్నాడు. ఆమె కదిలింది. కొన్ని క్షణాలతర్వాత ఆమె వెన్నెల వంకే చూస్తూ తనలో తనే మాటాడు. కొంటున్నట్టుగా, 'ఆయన ఎవరో అచ్చంగా మీలాగే ఉన్నాడు. అబ్బ నన్ను ఎంత వేధించాడు! కాని ఆయన ఎంతగొప్పవాడు! ఆయన ఎంత గొప్పగా చిత్రించాడు నా చిత్రం!'' అన్నది.

రామారావు కొన్ని క్షణాలు తలొంచుకొన్నాడు. ఏదో ఆలోచనలో పడ్డాడు. అంతలో తెపరిల్లుకొన్నాడు. 'ఆయన ఎవరో అచ్చంగా మీలాగే ఉన్నా'రన్నమాటలు మళ్ళీ వినిపించి




"నేను నిన్ను రిజిష్టరుమారేజి చేసుకుంటానంటే మీనాన్న నాకిది ప్రెజెంటేషన్ గా యిచ్చాడు"

నట్లనిపించింది ఆతనికి. అనుమానం కలిగిం దతనికి.

"ఏమిటి ఇదంతా నిజమా?" అని అడిగాడు రామారావు.

సమాధానం రాలేదు.

అతను తలఎత్తి చూచాడు. ఆమె అక్కడ కన్పించలేదు కొన్ని క్షణాల క్రితం ఆమె అక్కడినుంచి ప్రక్కగది లోకి వెళ్ళినట్లు ఏదో లీలగా జ్ఞాపకం వచ్చిం దతనికి. ఆతను అటు చూస్తుం డగానే-కళ్ళు పెద్దవిచేసుకొని పిచ్చిగా ఆమెవంక చూస్తుండగానే అటువెళ్ళింది సావిత్రి; కాని ఆతను గమనించలేదు. మనసు ఎక్కడో ఉన్నది. మరికొన్ని క్షణాలతర్వాత ఆమె అలా అవతలకు వెళ్ళినట్లు నిర్ధారణ అయింది. ఆతను కొంతసేపు ఆమె వెళ్ళిన దారివంకే చూస్తూఉండిపోయాడు. ఆ గుమ్మం అపవర్గదుర్గకవాటం అనిపించింది. ఆమె వెళ్ళినదారి నిత్యం నవవసంతశోభ వెల్లివిరిసే నందనవనాని కెళ్ళే బాటలా కన్పించింది. ఆమెను వెనక్కు పిలవా లని అనిపించింది అతనికి. కాని అది సాధ్యంకాలేదు మాట పెకిలిరాలేదు. అంతలో ఆమెను అలా పిలవడం వెళ్ళి పోయిన వసంతాన్ని వెనక్కు పిలవడం వంటిదని అనిపించింది.

అలాఅని ఆతనికి గట్టిగా, స్పష్టంగా అనిపించింది.

సావిత్రి ప్రక్కగదిలోకి వెళ్ళి, అక్కడ పెద్దసోఫాలో విశ్రాంతిగా కూర్చుని ఆలోచనలోపడ్డది.

రామారావు ఇక్కడ ఈ గదిలోనే కూర్చున్నాడు.

ఆమె కళ్ళు తెరచుకొనే చాలా మత్తుగా ఉన్నది. అతను కళ్ళు మూసుకొనే ఎంతో మెలకువగా ఉన్నాడు.

ఆమె అక్కడా ఆతను ఇక్కడా ఒంటరిగా కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తూనేఉన్నారు. ఏవేవో ఆశలు పెంచుకొంటూనేఉన్నారు. పట్టరాని ఆవేశాలను అణచివేసుకోవాలని విశ్వ ప్రయత్నం చేస్తూనేఉన్నారు. రక రకాల భయాందోళనలకు గురౌవుతూనేఉన్నారు.

అతని హృదయం ఆకాశంఎత్తున ఉప్పొంగిపోతోంది. వరదలలో ఉరకలు పెడుతున్న గోదావరిలా ఆమె హృదయం వరవళ్ళు త్రొక్కుతున్నది.

వారి ఇర్వురి హృదయాలూ పొంగిన రెండు మహానదు లయాయి.

అవి ఒకదానికొకటి సమాంతరంగా ప్రవహించాయి.

తెల్లవారింది. సావిత్రి చెరచెరా అతను కూర్చున్న గదిలోకి వచ్చింది. ఆతను తలఎత్తి ఆమెవంక చూచాడు. ఆమె కళ్ళు ఎఱ్ఱగా ఉన్నాయి. ఆమె చెక్కిళ్ళుకూడా ఎరుపెక్కాయి. రుస రుసలాడుతూ ఆమె అతనివంక కోపంగా చూచింది. మరుక్షణంలో తన కోపమంతా ప్రదర్శిస్తూ పెద్దపెద్ద అంగలువేస్తూ, అడుగులు గట్టిగా వేస్తూ, ఆమె అక్కడినుంచి లోపలకు వెళ్ళి పోయింది.

*　　*　　*

ఆ గదిలో బల్లమీద కాగితాలూ పుస్తకాలూఅవీ చక్కగా సర్దున్నాయి. ఎన్నడూ అలా తీర్చి దిద్దినట్టు లేవు. రామారావు నెమ్మదిగా బల్లదగ్గరకు పోయి చూచాడు

ఎవరో సర్దారు

అవును, సావిత్రే సర్ది ఉంటుం దను కొన్నాడు ఆతను. అంతలో అతనికి బల్లపైన ఉన్న కాగితం ఒకటి కనిపించింది ఆతను చప్పున అది తీసుకొని చూచాడు.

బదిలీఉత్తరు వది.

పై పదవిలో నియమిస్తూ ఆతన్ని అక్కడనుంచి బస్తీకి బదిలీచేస్తున్నట్టు అందులో వివరించబడిందికూడానూ. తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు. ఒకటికి రెండుసార్లు అది చదువు కొన్నాడు. మొదట ఆతను సంతోషించాడు. అంతలో ఆతను భయపడి పోయాడు. మళ్ళీ బల్లవంక చూచాడు, ఆ కాగితం అక్కడికి ఎలా వచ్చిందా అని సంశయిస్తూ. బదిలీఉత్తరువు ఉన్న




కాగితం క్రింద మరో కాగితం అతని కంటపడ్డది.

"ఇదేదో ఉత్తరమల్లే ఉందే," అనుకొంటూ అతను దాన్ని ఆత్రంగా తీసుకొన్నాడు.

'రామారావ్!' ఈ వారంనుంచీ నీ కీ విషయం చెబుదా మనుకొంటున్నాను. నువ్వు ఒట్టి బక్కాడివి. ఏం భయపడిపోతావో నని చెప్పలేదు నువ్వు సావిత్రితో నామీద పిర్యాదు చేశావటగా. అది సరిగ్గా పిర్యాదు అనడానికి వీల్లేదనుకో. కాని మొత్తం మీద అది అటువంటిదేగా. అది కారణంగా నిన్ను ఇక్కడనుంచి బదిలీ చేయించాను. ప్రమోషను కూడా వచ్చింది. ఆ పత్రాలవీ చూచావుగా. పెళ్లాంపిల్లలకోసం నువ్వు అంత దిగులుపడ్డావేం. మరి నాతోనే ఎందుకు చెప్పలా? ఈ మాట అంటే నేను నవ్వుతానని కూడా అన్నావుటగా! మరి అది మాత్రం నవ్వదా!...కాని అది పరిస్థితి సరిగా అర్థంచేసుకొన్నదిలే. అన్నట్టు మరిచాను; మరో విషయం చెప్పనా? దగ్గరవాడవు కనుక చెబుతాను. ఆమధ్య దానికి నేనంటే 'భక్తి' ఎక్కువయింది. అది కారణంగా కాబోలు, కొన్నాళ్ళు ఇంట్లో ఎవరితోనూ మాటాడడం మానేసింది. సరే అవన్నీ ఎందుకుగాని, మొన్న ఆ మధ్య విందు అయిన కొద్దిరోజులకు కాబోలు నేనే అడిగాను-మరి నీ కీసారి ఏం బహుమానం కావాలని. మీకే నేను బహుమానం ఇవ్వబోతున్నా నన్నది. నెమ్మదిగా శుభవార్త బయట పెట్టింది. మరి ఇప్పుడు చెప్పు ఏం కావాలో అన్నాను వెంటనే. నీకు ప్రమోషను ఇప్పించి తిరిగి మీ ఊరికి బదిలీ చేయించమని అది కోరింది-ఫలితంగా ఇలా జరిగింది.

రామారావ్ నువ్వు ఒట్టి భయస్తుడవని నాకు తెలుసు. దాని మనసూ తెలుసు నాకు. అందుకే ఎటువంటి

అనుమానాలకూ ఆస్కారం లేదు — నా కన్నీ తెలుసుకనుక. అది నిన్ను ఇంటికి పంపమని గట్టిగా కోరింది. అదీకాక అంతకుముందు నువ్వూ అడి గావు— ఏలాగో ఓలాగు బదిలీ చేయించ మని. అప్పుడు నేను పట్టించుకో లేదు. నీ మీద ఉండే అభిమానమే అందుకు కారణం. సరే ఇప్పుడు నీ కోరిక నెరవేరింది.

నీకు జ్ఞాపకం ఉందీ...

నేను కంట్రాక్టుపనులు ప్రాగంభిం చిన క్రొత్తరోజులలో నువ్వు నా కో చిన్న సాయం చేశావు. అప్పుడే డబ్బు ఇస్తానంటే వద్దంటే వద్దన్నావు ఆ పని మూలంగా ప్రభుత్వానికి నష్టంకానీ లాభంకానీ లేదు, కనుక 'రూల్సు' అంగీకరిస్తాయి కనుక చేశానని వాదిం చావు. ఏదో భయపడి డబ్బు వద్దంటు న్నావని వచ్చేశాను అప్పుడు. అబ్బో! ఇది ఏనాటి విషయం. నేను ఇప్పుడు బాగా పైకి వచ్చాను. ఈ విధంగా నీకు ప్రతిఫలం చెల్లించుకో కలిగినం దుకు సంతోషంగా వున్నది.

మనం ముగ్గురం సహాధ్యాయులం. ఒకరిమనసు ఒకరు తెలుసుకొన్న వాళ్ళం. అందువల్ల నువ్వు అనవసరపు విషయా లేమీ మనసులో పెట్టుకోకు. భార్యాపిల్లలతో నువ్వు అన్ని విధాలా సుఖపడాలనే అదీ నేనూ కోరుతున్నాం.

—నీ మిత్రుడు
ప్రకాశం.

ఉత్తరం చదవడం పూర్తి అయే సరికి రామారావుకు కాళ్ళు వణకడం మొదలుపెట్టాయి. అతనికి భయం వేసింది. అతనికి కోపం వచ్చింది; మరు క్షణంలో బాధ కలిగింది. పది నిమి షాలదాకా అతను స్తబ్దంగా ఉండి పోయాడు. కొంతసేపు తర్వాత తేరు కొని, ధైర్యం తెచ్చుకొని, ముందుకు వెళ్ళి, అక్కడ కుర్చీలో కూర్చు న్నాడు. ప్రకాశాన్నీ, సావిత్రినీ సరిగా అర్థంచేసుకోడానికి కొంత ప్రయత్నం చేశాడు. ఆమె ఎత్తుగడ అర్థం అయింది అతను చప్పున కుర్చీలోనుంచి లేచి నిలబడ్డాడు. ఎవరో తనను వెళ్ళమన్నట్టు అని పించింది. అతను అప్పటికప్పుడు ప్రయాణ మయాడు మంచిబట్టలు వేసుకొని, నౌకర్ను పిలిచి సామాను సర్దించాడు. పెట్టి, బెడ్డింగు నౌకరు తీసుకొని వెళ్ళి బండిలో పెట్టాక, అతను నెమ్మదిగా అడుగులో అడుగు వేసుకొంటూ తలవంచుకొనే ప్రకాశం ఉన్న గదిలోకి వెళ్ళాడు. ఒక క్షణం దూరంగా నిలబడ్డాడు అతను.

"సెలవు మరి," అన్నాడు రామా రావు అతికష్టంమీద. అతనికి మాటలు ఒకపట్టాన పెగిలిరాలేదు.

"శుభం," అలవోకగా పలికాడు ప్రకాశం.

ఒకక్షణంతర్వాత క్షేమంగావెళ్ళిరా అనికూడా అన్నా డతను.



ప్రకాశం ఎంతో ప్రసన్నంగా, ప్రశాంతంగాకూడా కన్పించాడు ... అతను చిరునవ్వు నవ్వుతూ ఏవిధమైన కోపం లేకుండా, ఎంతో సహజంగా అన్నాడా మాటలు. అతను నిండు హృదయంతో వీడ్కోలు చెప్పినట్లు అనిపించింది రామారావుకు. అతని చిరునవ్వు ఎంతో మైత్రీరమ్యంగా, హృద్యంగా ఉన్నది మళ్ళీ అందులో ఎంతో అనునయం ఉన్నది. హుందాగా కూడా ఉన్నది ఆ చిరునవ్వు.

రా ' రావుకు హృదయం తేలిక పడ్డది.

అతనికి కృతజ్ఞతాపూర్వకంగా నమస్కారంచేసి నెమ్మదిగా వీధిగుమ్మం వైపు వెళుతుంటే "దానితోకూడా చెప్పివెళ్ళవయ్యా-అది మనమర్యాద," అన్నాడు ప్రకాశం కొంచెం పెద్దగా, శాసిస్తున్నట్లుగా. అది పితృవాక్యంలా భావించి వెంటనే వెనుదిరిగి లోపలకు వెళ్ళాడు రామారావు.

అతను సావిత్రి ఉన్న గదిలోకి

వెళుతూ ఆమెను ఎన్నో అడుగుదా మనుకొన్నాడు. ఆమె ఫిర్యాదు స్వరూపం ఏమిటో అర్థం చేసుకోడానికి ప్రయత్నించాడు. తను ఏమీ అడుగక ముందే ఆమె తానుగా ఏమో చెబుతుం దనీ ఆశించాడు. కాని తీరా వెళ్ళాక, ఆమెముందు ఏమీ మాట్లాడలేక పోయాడు.

సోఫాలో కూర్చున్న మనిషి లేచి నిలబడ్డది అతన్ని చూచి. ఆమె కొంతసేపు మాటాడలేదు. మొదట ఆమె అసలు అతనివంకే చూడలేదు. అతను నెమ్మదిగా ముందుకు వచ్చి ఆమెకు ఎదురుగా నిలబడి "మరి నాకు సెలవు ఇప్పిస్తే వెళతాను," అన్నాడు.

సావిత్రి కొన్ని క్షణాలు అలాగే నిలబడి నెమ్మదిగా వెనుతిరిగి సోఫా దగ్గరకు వెళ్ళి అక్కడ దిండుక్రింద బెట్టిన కాగితం ఒకటి తెచ్చి అతని చేతి కిచ్చింది. తలవంచుకొని అతనిముందు నిలబడ్డది. కొన్ని క్షణాలతర్వాత ఆమె నెమ్మదిగా మాటాడింది. "దీనికి ఒక సుప్రసిద్ధ చిత్రకారుడు గీచిన ముఖచిత్రం ఆధారం. అదినాది. ఇదిమీది. ఇదికూడా అంత గొప్పచిత్రమే. ఇది నా అభి మానానికి చిహ్నంగా మీదగ్గర ఉంచు కోండి. ఇక మీరు వెళ్ళండి మీకు అన్ని విధాలా శుభం కలుగుతుంది," అని ఆమె వెనుదిరిగింది.

మున్ముందుగా అతనికి ఆమె అభిమానం అర్థమయింది. ఒక్కసారి విద్యుద్ఘాతం తగిలినట్లుగా అతను స్తంభించిపోయాడు. మరునిముషంలో అతను తేరుకొన్నాడు. ఒకానొక మధురమైన భావం కలిగింది. హృదయ భారం తగ్గింది. అతను నెమ్మదిగా వెనుదిరిగి తల వంచుకొని మధుర భావనలో మునిగిపోతూ ముందుకు నడిచాడు. ఆ గదిగుమ్మం దాటాక అతనికి చేతిలోవున్న చిత్రంవిషయం జ్ఞాపకం వచ్చింది. అతను చప్పున అది పైకిఎత్తి దానివంక చూచాడు.

అతను చకితుడయాడు.

అది అతనిభార్య ముఖచిత్రం.

అతను కొంతసేపు అక్కడే నిలబడి పోయాడు. కొద్ది నిముషాలక్రితం సావిత్రి అన్నమాటలు నెమ్మదిగా జ్ఞాపకం చేసుకొన్నాడు. అంతకంటె నెమ్మదిగా ఆ మాటలు అర్థం చేసు కొన్నాడు. అతనికి ఒక అనుమానం కలిగింది. అంతలో అప్పటిదాకా తన గదిలో బల్లమీద ఉన్న తనభార్యఫొటో సామాను సర్దుకొనేటప్పుడు తనే స్వయంగా పెట్టెలో భద్రపరచిన విషయం జ్ఞాపకం వచ్చేసరికి అతనికి మొదట కలిగిన అనుమానం నివృత్తి అయింది.

రామారావు నవ్వుకొంటూ గబ గబా వీధిగుమ్మంవైపుకు నడిచాడు.

—